
సాక్షి మంచిర్యాల

బుధవారం, 15, మార్చి, 2023



కౌలు గోస

8లో▸

కౌలు ధరలు చుక్కలనంటుతుండడంతో కౌలురైతులు అరిగోస పడుతున్నారు. మరో వైపు పంటల పెట్టుబడులు ఏటేటా పెరిగిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు.



ఏమి హాయిలే ఇలా..

జన్నారం: ఎండ తీవ్రతను తట్టుకోలేక పక్షులు నీటిని ఆశ్రయిస్తున్నాయి. అరుదుగా కనిపించే ఇండియన్ స్పాట్ బిల్‌డ్ డక్ జన్నారంలోని బైసన్‌కుంటలో ఇలా కనిపించాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0 /21.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మెరిట్ జాబితా విడుదల

మంచిర్యాలఅగ్రికల్చర్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) ఆర్‌బీఎస్‌కె, ఆయుష్ పోస్టుల కోసం అభ్యర్థుల మెరిట్ జాబితా విడదల చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ప్రదర్శించామని, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించిన అనంతరం మెరిట్ జాబితాను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం, జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ప్రదర్శించామని పేర్కొన్నారు.

17న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో పోస్టుల భర్తీకి ఈ నెల 17న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు. మంచిర్యాలలోని జీజీహెచ్‌లో 2, చెన్నూర్ సెమాంక్ సెంటర్ 1, ఓబీజీ నిపుణులు, యూపీహెచ్‌సీ, షంషేర్‌నగర్, నస్పూర్‌లలో 2 వైద్యాధికారులు ఎంబీబీఎస్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఒక జత జిరాక్స్‌తో హాజరు కావాలని తెలిపారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాలటౌన్: సాగునీరు అందక ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే మంత్రి హరీష్‌రావు జిల్లాలో పర్యటించాలని, లేనిపక్షంలో బుధవారం మంత్రి పర్యటనను అడ్డుకుంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గూడెం లిఫ్ట్, కడెం కాలువ ద్వారా సాగునీరు అందక ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 2021 మార్చిలో మంత్రి హరీష్‌రావు గూడెం లిఫ్ట్ పైపులను మారుస్తామని చెప్పి, ఇప్పటికీ మార్చకపోవడంతో తరుచూ పైపులు పగలిపోతున్నాయని, దీంతో సాగునీరు లేక పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, రజనీశ్ జైన్, తుల ఆంజనేయులు, గాదె శ్రీనివాస్, కారుకూరి మధుకర్, జోగుల శ్రీదేవి, పెట్టం శ్రీరాం, బుద్దారపు రాజమౌళి, రాకేశ్ రెన్వా, గడికొప్పుల చంద్రమౌళి, తరుణ్ పాల్గొన్నారు.


ఎస్టీపీపీలో చండీయాగం



యాగంలో పాల్గొన్న ఎస్టీపీపీ అధికారులు

జైపూర్: మండల కేంద్రంలోని 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో మంగళవారం మైసమ్మ దేవాలయ 7వ వార్షికోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ నేతృత్వంలో చండీయాగం నిర్వహించారు. ఎస్టీపీపీలో పని చేస్తున్న అధికారులు కుటుంబసభ్యులతో చండీయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆరోగ్య మహిళా క్లినిక్‌లో వైద్యం



మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మంచిర్యాలటౌన్: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ జిల్లాలోని నాలుగు ఆసుపత్రుల్లో ఆరోగ్య మహిళా క్లినిక్‌లను ప్రారంభించగా, ప్రతీ మంగళవారం మహిళలకు వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేశారు. మొదటి మంగళవారం జిల్లా కేంద్రంలోని హమాలీవాడలోని బస్తీ దవాఖానాలో మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు చేశారు. ప్రతీ మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు తెలిపారు.

విజయోస్తు..!



మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నంబర్లు వేస్తున్న ఉద్యోగులు

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 15 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 61 కళాశాలలకు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులు 6,910 మంది, ద్వితీయ సంవత్సరం 7,758 మంది హాజరు కానున్నారు. పరీక్షల్లో అవకతవకలకు తావు లేకుండా సజావుగా జరిగేందుకు ఇదివరకే జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పోలీసు, విద్యుత్, విద్య, వైద్యశాఖలు, ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్షించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, పరీక్ష సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు.

చూచిరాతకు పాల్పడకుండా..

ప్రతీ పరీక్ష కేంద్రంలోనూ సీసీ కెమెరాలు తప్పనిసరి చేశారు. వీటి ఎదురుగానే ప్రశ్నపత్రాలను కవర్ల నుంచి తెరవడంతోపాటు జవాబు పత్రాలను ప్యాకింగ్ చేస్తారు. దూర ప్రాంత విద్యార్థుల కోసం ఆయా రూట్లలో ఆర్టీసీ బస్సులు నడిపించనుంది. ఇదివరకే ఇంటర్ విద్యాధికారులు ఏయే రూట్లలో విద్యార్థులు ఉన్నారో పూర్తి వివరాలు అందించారు. పరీక్షల్లో చూచిరాతకు పాల్పడకుండా కఠిన చర్యలు చేపట్టారు. ఇందుకోసం హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల కమిటీ, ఫ్లయింగ్, సిట్టింగ్‌స్క్వాడ్ బృందాలు నిరంతరం పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తాయి. ప్రతీ పరీక్ష కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసి వేయనున్నారు. 144 సెక్షన్ అమలు కానుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాలకు అనుమతించరు. నిర్ణీత సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రాల లోపలికి అనుమతిస్తారు. హాల్‌టికెట్ల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష రాయడానికి అవకాశం కల్పించారు. పరీక్షల సమయంలో కొంతమంది విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. ఈ ఒత్తిడిని తగ్గించేందుకు అవసరమైన కౌన్సెలర్‌ను ఇంటర్ బోర్డు నియమించింది. 24గంటలపాటు ఆయా నంబర్లలో అందుబాటులో ఉంటారు.

జిల్లాలో ఇలా..

పరీక్ష కేంద్రాలు	24
చీఫ్ సూపరింటెండెంట్లు	24
డిపార్ట్‌మెంటల్ అధికారులు	24
అదనపు చీఫ్ సూపరింటెండెంట్లు	8
సిట్టింగ్ స్క్వాడ్	2
కస్టోడియన్లు	12
ఇన్విజిలేటర్లు	520
ఫ్లయింగ్ స్క్వాడ్	1
ఏఎస్‌ఎంలు	48

విద్యార్థులు

ప్రథమ సంవత్సరం	6,910
ద్వితీయ సంవత్సరం	7,758
మొత్తం	14,668

సందేహాలు, సమస్యల నివృత్తికి హెల్ప్‌లైన్ నంబర్లు

7780129509, 8328612124

ప్రత్యేక బస్సులు

ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఎంజీపీటీబీసీడబ్ల్యూఆర్ స్కూల్‌కు చెందిన విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపనున్నారు. విద్యార్థులను ఆయా పాఠశాలల నుంచి నేరుగా పరీక్ష కేంద్రం వరకు చేర్చనున్నారు. లక్సెట్టిపేట నుంచి మంచిర్యాలకు, బెల్లంపల్లి నుంచి ఆయా సెంటర్ల వరకు, మందమర్రి మార్కెట్ నుంచి పరీక్ష కేంద్రాలకు నేరుగా ప్రత్యేక బస్సుల ద్వారా చేరుస్తారు. చెన్నూర్, ఇతర ప్రాంతాలకు ఉదయం 5గంటలకు మంచిర్యాల బస్‌స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరి ఆయా ప్రాంతాలకు వెళ్లనున్నాయని ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. అస్నాద్, బీరెల్లి, ముల్కలపేట్ తదితర మారుమూల ప్రాంతాలకు బస్సులు పరీక్ష సమయంలో నడుస్తాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. హాల్‌టికెట్ల జారీ విషయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసే కళాశాలలపై చర్యలు ఉంటాయి. విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంది. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు ఉండేలా ఏర్పాట్లు చేశాం. కలెక్టర్ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లపై చర్చించాం.

– డీఐఈవో శైలజ

మంత్రివర్యా.. సమస్యలు తీర్చరూ..!

- ప్రారంభానికి నోచుకోని మెడికల్, నర్సింగ్ కాలేజీల నిర్మాణం
- స్థలాల కేటాయింపులో అలసత్వం
- ఎంసీహెచ్‌లో వైద్యులు, ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది కొరత
- నేడు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు జిల్లా పర్యటన



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ

మంచిర్యాలటౌన్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు బుధవారం జిల్లా పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లోని సమస్యల పరిష్కారంపై ఆశలు నెలకొన్నాయి. సమస్యలు పరిష్కరించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా జిల్లా ప్రజలు కోరుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలను ప్రభుత్వం గత ఏడాది మంజూరు చేసింది. వీటితోపాటు టీ డయాగ్నోస్టిక్ హబ్‌కు గత ఏడాది మార్చిలో మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలకు ఇప్పటికీ పక్కా భవనాల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. వీటి కోసం కేటాయించిన స్థలం ముంపునకు గురవుతుండడంతో శాశ్వత నిర్మాణాలు ఎక్కడ చేపట్టాలో ఇంకా నిర్ణయించలేదు. దీంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాముల్లో మెడికల్ కళాశాల నిర్వహిస్తున్నారు. నర్సింగ్ కళాశాల అద్దె భవనంలో విద్యార్థుల వసతుల ఏర్పాటు పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. మూడు నెలలుగా వారికి ప్రత్యక్ష తరగతులు నిర్వహించలేక.. ఆన్‌లైన్‌లో కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీలో 150 ఎంబీబీఎస్ సీట్లకు గాను నేషనల్ మెడికల్ కౌన్సిల్ 100 సీట్లకు మాత్రమే నిబంధనలతో అనుమతి మంజూరు చేసింది. ఈ ఏడాది మెడికల్ కాలేజీకి పక్కా భవనం నిర్మించకుంటే రెండో ఏడాదికి అనుమతులు కష్టమే. టీ డయాగ్నోస్టిక్ హబ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిర్మాణం పూర్తయితే అన్ని రకాల పరీక్షలు ఉచితంగా పొందేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనూ వైద్యులు, వైద్య సిబ్బంది కొరత వేధిస్తుండగా, ఎక్స్‌రే విభాగంలో సరిపడా సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బెల్లంపల్లి ఆసుపత్రిని 30 పడకల నుంచి 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేసినా, ఇప్పటికీ 30 పడకలకు సరిపడా సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారు. అంతే బడ్జెట్ కేటాయిస్తుండడంతో వంద పడకలకు సరిపడా రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

తప్పని ఎంసీహెచ్ కష్టాలు

మెడికల్ కాలేజీకి అనుబంధంగా కాలేజీ రోడ్డులో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో గత ఏడాది వైద్య సేవలు ప్రారంభించినా నాటి నుంచి కష్టాలు తప్పడం లేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎంసీహెచ్‌కు వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం ప్రత్యేక వాహనంలో వెళ్లాల్సిందే. మొదట్లో కల్పించిన బస్సు సౌకర్యం కొద్ది రోజులకే నిలిపి వేశారు. దీంతో గర్భిణులు ఆటోలపై ఆధారపడాల్సి వస్తోంది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఎంసీహెచ్ భవనం వరద నీటిలో మునిగిపోయి గత నెల వరకు వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. గత నెలలో ఓపీ సేవలు, ఇటీవల శస్త్రచికిత్స, ప్రసవాలు చేపడుతున్నారు. వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. గతంలో ఎనిమిది మంది వైద్యులతో ప్రసూతి సేవలు అందించగా.. ప్రస్తుతం ఇద్దరే పని చేస్తున్నారు. సాధారణ ప్రసవాలను చేపట్టాలన్న ప్రభుత్వ ఒత్తిడిలో శస్త్రచికిత్సలు చేయాల్సిన పరిస్థితుల్లో ఏం చేయాలో అర్థకాక తీవ్ర ఒత్తిడిలో వైద్యులు వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. వైద్యుల నియామకానికి ప్రకటనలు వెలువడుతున్నా పనిచేసేందుకు ముందుకు రావడం లేదు. గర్భిణులకు స్కానింగ్ చేసేందుకు జిల్లాలోని అన్ని సీహెచ్‌సీలలో సదుపాయాలు ఉన్నా నేరుగా ఎంసీహెచ్‌కే వచ్చి స్కానింగ్ చేయించడం వల్ల ఎక్కువ భారం పడుతోంది. దీంతో ఉదయం 9 గంటలకు వచ్చిన వారు మధ్యాహ్నం 1 వరకు ఆసుపత్రిలోనే స్కానింగ్ కోసం వేచి చూడాల్సి వస్తోంది. ఈ ఏడాది వర్షాకాలంలోనూ భారీ వర్షాలు కురిస్తే మునిగిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న ఐబీ ఆవరణలో ఎంసీహెచ్ భవనాన్ని నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అతి సమీపంలోనే ఉండడంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంటుంది.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మంచిర్యాలలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులకు కోసం 54 పరీక్ష కేంద్రాలు, ఒక్కసారి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అన్నారు. సీఎస్, డిపార్టుమెంటల్ అధికారులకు కేటాయించిన పరీక్ష కేంద్రాలను సందర్శించి సౌకర్యాలు చూసుకోవాలని, ఏదైనా సమస్యలుంటే ఎంఈవోల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఆరు పేపర్లు మాత్రమే ఉంటాయని, ఏప్రిల్ 3 నుంచి 13వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా సహాయ పరీక్షల అధికారి దామోదర్‌రావు, మండలాల విద్యాధికారులు, సీఎస్, డీవోలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన



డీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాల బస్టాండ్ నుంచి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం వరకు చేరుకుని అరగంటపాటు ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం పంచాయతీ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీఓ 51 సవరించాలని, పీఆర్సీ వర్తింపజేయాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అవునూరి సాగర్, దుమ్మల సుధాకర్, కోశాధికారి సాయికృష్ణ, ఉపాధ్యక్షులు రాజలింగు, చిన్నన్న, నాయకులు రవి, శంకర్, చందు, నర్సయ్య, వెంకటేశ్, కుమార్ పాల్గొన్నారు.

జింక స్వాధీనం



పట్టుకున్న జింక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ కృష్ణా కాలనీలో మంగళవారం మధ్యాహ్నం జింకను స్థానికులు పట్టుకున్నారు. కుక్కలు వెంట పడడంతో పరుగెత్తుకుంటూ కాలనీలోకి రాగా స్థానికులు లక్ష్మణ్, రాజు కుక్కలను తరిమేశారు. జింక కాలికి క్లచ్‌వైర్ చుట్టుకుని గాయం కాగా సపర్యలు చేసి తొలగించారు. పోలీసులు, అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. మంచిర్యాల ఎఫ్‌డీవో వినయ్‌కుమార్ సాహు తన సిబ్బందితో చేరుకుని జింకను స్వాధీనం చేసుకున్నారు. చికిత్స అనంతరం బొక్కలగుట్ట వద్ద ఉన్న గాంధారి వనానికి తరలించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- అభివృద్ధి పనుల పరిశీలన
- నేడు మంత్రుల పర్యటన



చెన్నూర్‌లో కేసీఆర్ పార్క్ పనులను పరిశీలిస్తున్న విప్ సుమన్, కలెక్టర్ సంతోష్, నాయకులు



జైపూర్‌లో సెంట్రల్ లైటింగ్ ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న విప్ బాల్క సుమన్

చెన్నూర్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. బుధవారం రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు పరిశీలించారు. విప్ సుమన్ మాట్లాడుతూ మంత్రులు బుధవారం జైపూర్ మండలం ఇందారం వద్ద నిర్మించిన బ్రిడ్జి, రామారావుపేటకు వెళ్లే బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తారని అన్నారు. ఇందారం సెంట్రల్‌లైటింగ్ సిస్టమ్, కస్తూర్బా నూతన భవన శంకుస్థాపన చేస్తారని తెలిపారు. భీమారం సెంట్రల్ లైటింగ్, జోడువాగు వద్ద అంబేద్కర్ ఏకో పార్క్‌లను ప్రారంభిస్తారని తెలిపారు. 100 పడకల ఆస్పత్రి భవనం, శాటిలైట్ బస్‌డిపోలకు శంకుస్థాపన, మినీ స్టేడియం ప్రారంభం, కుమ్మరికుంట మినీ ట్యాంక్‌బండ్, వానమామలై వరదాచార్యుల విగ్రహావిష్కరణ, డంపింగ్ యార్డ్, మహిళా భవనం శంకుస్థాపన తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే సభలో పాల్గొంటారని తెలిపారు. నస్పూర్‌లో సమీకృత జిల్లా కార్యాలయ సముదాయాన్ని సందర్శిస్తారని, లక్సెట్టిపేట 30 పడకల ఆస్పత్రి, సెంట్రల్ మెడికల్ స్టోర్‌లకు శంకుస్థాపన చేస్తారని వివరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

జైపూర్/చెన్నూర్‌రూరల్/భీమారం: చెన్నూర్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, శంకుస్థాపన కార్యక్రమాల ఏర్పాట్లను విప్ సుమన్, కలెక్టర్ సంతోష్ మంగళవారం పరిశీలించారు. జైపూర్ మండలం ఇందారం వద్ద రూ.37.50 కోట్లతో నిర్మించిన ఫ్లై ఓవర్‌బ్రిడ్జి సందర్శించి పలు సూచనలు చేశారు. చెన్నూర్ మండలం లింగంపల్లి గ్రామ సమీపంలో అంబేద్కర్ ఎకో పార్కును పరిశీలించారు. 250 ఎకరాల్లో రూ.2కోట్లతో నిర్మించిన ఈ పార్కును మంత్రి హరీష్‌రావు ప్రారంభిస్తారని తెలిపారు. భీమారంలో సెంట్రల్ లైటింగ్ పనులను సందర్శించారు. మంత్రి పాల్గొనే సభా ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

పాఠశాల తనిఖీ

చెన్నూర్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను విప్ సుమన్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అమలు తీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

ప్రజలంతా కంటి పరీక్షలు చేయించుకోవాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్



పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

జైపూర్: కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రజలంతా కంటి పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కంటి పరీక్షలు చేయించుకున్న గ్రామస్తులతో మాట్లాడారు. దృష్టిలోప నివారణకు చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్లందరూ తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలందరికీ లక్ష్యం మేరకు కంటి పరీక్షలు చేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 40కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతీ శిబిరానికి ఒక బృందాన్ని నియమించామని, జిల్లాలో ఇప్పటివరకు 153గ్రామ పంచాయతీలు, 78వార్డుల్లో కంటివెలుగు నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేశామని పేర్కొన్నారు. 98,339మంది పురుషులు, లక్షా 10,825మంది మహిళలు, 79మంది ఇతరులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రీడింగ్ అద్దాలు 35,382మందికి అందించామని, 35,382మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు ఆర్డర్ చేసి 11,716మందికి అందజేశామని వివరించారు. వైద్యాధికారి అనిల్‌రావు, వైద్యురాలు వేదశ్రీ, డీఈఓలు తేజస్విని, లావణ్య, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ స్వాతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఈ నెల 16న నస్పూరు మున్సిపాలిటీ పరిధి సీతారాంపల్లి జెడ్పీ హైస్కూల్లో జిల్లాస్థాయి వుమెన్స్ ఖేలో ఇండియా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబమూర్తి, మారయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 19న హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తిగల మహిళా క్రీడాకారులు తగిన ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

బాల్య వివాహాలు అడ్డుకున్న అధికారులు



బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ సిబ్బంది

రెబ్బెన: మండలంలోని పాశిగాంలో మంగళవారం బాల్యవివాహాన్ని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు అడ్డుకున్నారు. పాశిగాంకు చెందిన బాలికను రింగన్‌ఘాట్‌కు చెందిన యువకుడికిచ్చి బుధవారం వివాహం జరిపించేందుకు బాలిక తల్లిదండ్రులు ముహూర్తాన్ని నిశ్చయించారు. అయితే విషయం తెలుసుకున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మహేశ్‌తో పాటు ఐసీడీఎస్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు పాశిగాంకు వెళ్లి బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి వివాహాన్ని అడ్డుకున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నిర్ణీత వయస్సు దాటాక వివాహం చేయాలని, ముందే జరిపితే నేరమని హెచ్చరించారు. ఇదే తరహాలో సోమవారం రాత్రి రాజారం గ్రామానికి చెందిన మరో బాలికకు నంబాల గ్రామానికి చెందిన యువకుడితో వివాహాన్ని జరిపించేందుకు సిద్ధమవగా వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాన్ని అడ్డుకున్నట్లు డీసీపీవో తెలిపారు. జిల్లాలో ఎవరైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విత్తన దళారులపై ఫిర్యాదు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి, సోమగూడం, సండ్రల్‌పాడ్, ముత్యంపల్లి, వరిపేట తదితర గ్రామాల రైతులు ఓ విత్తన కంపెనీ మధ్యవర్తులపై మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. సింధు కంపెనీ పేరుతో కొంతమంది స్థానికంగా ఉండే మధ్యవర్తులతో వచ్చి రైతులకు బాస్మతి వరి విత్తనాలు అందించి, సాగు చేసుకుంటే లాభాలుంటాయని నమ్మించారు. విత్తనాలు ఇచ్చిన కంపెనీనే తిరిగి పంట కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. దీంతో పలు గ్రామాల రైతులు సుమారు 70 ఎకరాల్లో వారిచ్చిన విత్తనాలు సాగు చేశారు. ఎకరాకు రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. కాగా, పంట పురుగు పట్టి ఎదుగుదల లేక రైతులు పూర్తిగా నష్టపోయారు. నకిలీ విత్తనాల కారణంగా రైతులు 70 ఎకరాల్లో రూ.21 లక్షల వరకు నష్టపోయారు. తమకు సదరు విత్తన కంపెనీ నుంచి పరిహారం ఇప్పించాలని బాధిత రైతులు మధ్యవర్తిత్వం చేసినవారిపై కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి గాయాలు

తిర్యాణి: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పంచాయతీ కార్యదర్శికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగి ఘాట్ సెక్షన్‌లో మంగళవారం ముల్కలమంద గ్రామపంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న లక్ష్మ బైక్‌పై ముల్కలమంద నుంచి తిర్యాణి వైపునకు వస్తున్నాడు. మంగి ఘాట్ సెక్షన్‌లో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో లక్ష్మ ఎడమ కాలు బైక్ చక్రాల్లో ఇరుక్కుపోగా తీవ్ర గాయాలయ్యాయి. అతడిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతడిని మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు అతడి కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన ఆకుల ప్రసాద్ (22) మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రసాద్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి తల్లి లక్ష్మితో గొడవపడ్డాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కౌలు గోస

- చుక్కలనంటుతున్న కౌలు ధరలు
- పంట పండినా.. ఎండినా కట్టుడే..
- పైకం ముందే చెల్లించేలా ఒప్పందం
- ఏటా పెరుగుతున్న పెట్టుబడులు
- అందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- పంట రుణాలివ్వని బ్యాంకులు
- దిక్కు తోచని స్థితిలో కౌలు రైతులు





మంచిర్యాలఅగ్రికల్చర్: వారు పుడమి పుత్రులు.. ఊహ తెలిసిన నుంచి మట్టినే నమ్ముకున్నారు.. వారికి తెలిసిన పని ఒక్కటే వ్యవసాయం.. ఉన్న కాస్తో.. కూస్తో.. భూమికి తోడు మరికొంత కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నారు. ప్రకృతి కరుణించి, గిట్టుబాటు ధర బాగుంటేనే సరి.. లేకుంటే అంతేసంగతి.. రెండేళ్లుగా కౌలు రైతులు పడుతున్న గోస అంతా ఇంతా కాదు. మరో మూడు నెలల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుండగా కౌలు ధరలకు రెక్కలొచ్చాయి. పెరిగిన ధరలు, కూలీ రేట్లతోపాటు రూ.వేలకువేలు భూయజమానులకు కౌలు డబ్బులు చెల్లించాలి. పైగా భూయజమానులు ముందుస్తుగా కౌలు డబ్బులు అడుగుతుండగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

3.60 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో సాగుకు అనుకూల నల్లరేగడి భూములు అధికంగా ఉండగా అనేక మంది రైతులు ఏటా లక్షల ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో 3.60 లక్షల ఎకరాలు సాగవుతుండగా ఇందులో అధికంగా పత్తి, వరి వేస్తున్నారు. భూయజమానులు 1.47 లక్షల మంది ఉండగా.. అసలు భూమి లేని రైతులు, ఎకరా.. అరెకరా ఉన్న రైతులు 26వేల మంది దాకా ఉన్నారు. వాణిజ్య పంట పత్తి, ఆహార పంటలు వరి, కంది సాగు చేస్తున్నారు. జిల్లాలో గతేడాది ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు పంటలు నీటమునిగి కౌలు రైతులు నష్టాలు చవిచూశారు. ఒక ఏడాది అతివృష్టితో.. మరో ఏడాది వర్షాలు పడక నష్టపోతున్నారు. ఒక్కోసారి పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు దెబ్బతీస్తున్నాయి. అలాగే ఒక్కోసారి తొలకరి వానలతో పంటలు విత్తుకున్నాక పూత, కాతకు వచ్చే సమయంలో వర్షాలు మొహం చాటేయడంతో పెట్టుబడి కూడా రాక అప్పుల పాలవుతున్నారు. వచ్చిన పంటకు గిట్టుబాటు ధర లభించక నష్టాల పాలవుతున్నారు. కౌలు రైతులకు ఇతర రైతుల మాదిరిగా బ్యాంకులు పంట రుణాలివ్వవు. దీంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీకి అప్పు తీసుకుని సాగు చేస్తున్నారు.

అందని ప్రభుత్వ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం రైతుబంధు అందదు. రైతుబీమా వర్తించదు. కేంద్రం అందించే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రాదు. అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్టపోతే బీమా పథకం వర్తించదు. దీంతో కౌలు రైతులు వడ్డీ వ్యాపారులు, దళారులను ఆశ్రయించక తప్పడంలేదు. పంట పండిన తర్వాత వారికే విక్రయించాల్సి రావడంతో అడుగడుగునా వీరివి కన్నీటి కష్టాలే.

ముందస్తు కౌలుకు ఒప్పందాలు

గతంలో రైతులపై నమ్మకంతో భూయజమానులు కౌలుకు ఇచ్చేవారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చేదాకా నమ్మడంలేదు. సాగుకు ముందుగానే కౌలు డబ్బులు తీసుకుంటున్నారు. వానాకాలం సీజన్ మూడు నెలల్లో ఆరంభం కానుండగా ఇప్పటి నుంచే కౌలుకు భూములు తీసుకునేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ తరుణంలో భూయజమానులు కౌలు ధరలు అమాంతం పెంచారు. కౌలుకు భూమి తీసుకుంటున్న రైతులు 80శాతం పత్తి, 20 శాతం వరి సాగు చేస్తున్నారు. పత్తి పంటకు మద్దతు ధర ఈ ఏడాది క్వింటాల్‌కు రూ.6,380 ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు రూ.7,500 నుంచి రూ.8వేలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధర కంటే ఎక్కువగా లభిస్తుండగా పూర్తి వర్షాధారంతో పత్తి సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. రానున్న రోజుల్లో పత్తి ధర పెరుగుతుందన్న ఆశతో ముందస్తుగా కౌలుకు భూములు తీసుకుని ఒప్పందాలు చేసుకుంటున్నారు. కౌలు రైతుల డిమాండ్‌తో భూయజమానులు నీటి సౌకర్యం ఉన్న నల్లరేగడి నేలలకు ఎకరాకు రూ.15వేల నుంచి రూ.22వేల వరకు, రేగడి, ఎర్రనేలలు, చౌక భూములకు రూ.13వేల నుంచి రూ.18వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. సాగునే నమ్ముకున్న రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో కౌలు డబ్బులు చెల్లించి చదును పనులు ప్రారంభించారు.

పెరుగుతున్న పెట్టుబడులు

కౌలు ధరలతోపాటు సాగుకు పెట్టుబడి ఖర్చులూ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ధరలు ఏటేటా పెరిగాయి. ఒక్కో కూలీకి గతంలో రూ.400 నుంచి రూ.500 ఉండగా.. ప్రస్తుతం రూ.600 నుంచి రూ.700 వరకు తీసుకుంటున్నారు. వరికోత, పత్తి తీత సమయంలో ఈ డిమాండ్ మరింత ఎక్కువగా ఉంటోంది. మరోవైపు కూలీల కొరత కారణంగా యంత్రాల వాడకం పెరిగింది. దీంతో రోజురోజుకూ పెరుగుతున్న డీజిల్ ధరల కారణంగా వాటి అద్దెకూడా పెంచుతున్నారు. కౌలు రైతులకు బ్యాంక్ రుణాలు హామీగానే మిగిలిపోగా దిగులు చెందుతున్నారు. ఉద్దెర ఇచ్చే వ్యాపారులు కూడా వర్షాభావ పరిస్థితులను చూసి రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇచ్చేందుకు సాహసించే పరిస్థితి కనిపించడంలేదు.

కౌలు ధరలు భగ్గుమంటున్నయ్

ఎకరం సొంత భూమి ఉంది. పదెకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్న. పోయినేడాది ఎకరాకు రూ.12వేలు కౌలు తీసుకున్నరు. ఈసారి రూ.16వేలు అడుగుతున్నరు. సరే.. అని పంట చేతికచ్చాక ఇస్తానంటే ముందే ఇమ్మంటున్నరు. అప్పు తెచ్చి ముందే పదెకరాలకు రూ.1.60 లక్షలు ఇచ్చి భూమి చదును చేస్తున్న. ఎవుసంజేసుడు కత్తిమీద సాములాంటిదే. సర్కారే కౌలు రైతులకు ఏదైన చేయాలె.

– భీమిరాజుల వెంకన్న, నెన్నెల


పండకపోయినా కట్టుడే..

పంట ఎండిన, నీట మునిగినా.. భూయజమానికి కౌలు డబ్బులు ముందే కట్టాలే. కౌలు ధరలతోపాటు పెట్టుబడులు పెరుగుతున్నయ్. కానీ.. గిట్టుబాటు ధర లేదు. ఎవుసం తప్ప మరేపనీ రాదు. అందుకే దేవుని మీదే భారం వేసి తప్పనిసరి పరిస్థితుల్లో కౌలుకు భూమి తీసుకొని సాగు చేస్తున్న. ఈసారి ఎకరానికి రూ.20వేల చొప్పున ఆరెకరాలు కౌలు తీసుకుని రూ.1.20 లక్షలు ముందే కట్టిన. ఏమైద్దో.. ఏమో..

– రాజమల్లు, ముత్తపూర్, కన్నెపల్లి

మేలుకో.. తెలుసుకో..

- వస్తు సేవల్లో మోసాలపై జాగ్రత్త
- ప్రతీ కొనుగోలుకు రశీదు తప్పనిసరి
- లేదంటే నష్టపోవాల్సిన పరిస్థితి
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం



పాతమంచిర్యాల: మార్కెట్‌లో మనం కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు తప్పనిసరిగా రశీదు పొందాలి. ఆ రశీదును భద్రపరుచుకోవాలి. ఎందుకంటే ఆ చిన్న రశీదుకు మీ హక్కులను రక్షించే శక్తి ఉంది. అందుకే ఏదైన వస్తువు కొన్నప్పుడు దాని రశీదును జాగ్రత్తగా కాపాడుకోవాలి. కొన్న వస్తువులు నకిలీవి అని తేలినప్పుడు మన వద్ద రశీదు లేకుంటే మనం ఏమీ చేయలేని పరిస్థితి. కొన్న వస్తువు నాణ్యత లోపంతో ఉన్నట్లయితే న్యాయపోరాటం చేయడమే మనకున్న ఏకైక మార్గం. ఇది మన హక్కు కూడా. ఈ న్యాయపోరాటంలో వినియోగదారుడు ఉత్పత్తిదారుడి నుంచి పరిహారం పొందే వీలుంటుంది. దానికంటేముందు కొనే వస్తువు సేవల్లో నాణ్యత, స్వచ్ఛత ఉండాలనే విషయం వినియోగదారులు ముందుగా తెలుసుకోవాలి. వస్తువు ఉపయోగించడానికి తగ్గట్లుగా లేకున్నా.. ప్రాణ, ఆస్తి నష్టం కలిగించేలా ఉన్నా ఆ వస్తువులు అమ్మినవారిపై ఫిర్యాదు చేసి తమ హక్కును కాపాడుకోవడమే వినియోగదారుల హక్కుల్లో ఉండే మొదటి అంశం.

ఇదీ.. చారిత్రక నేపథ్యం..

1962 మార్చి 15న అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ దేశ పౌరుల కోసం ప్రప్రథమంగా వినియోగదారుల హక్కులు ప్రకటించారు. అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకులు మార్చి 15ను ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా పరిగణించాలని తీర్మానించారు. దీంతో 1973 నుంచి ప్రపంచ దేశాలు దీన్ని పాటించడం ప్రారంభించాయి. మన దేశంలో 1986లో వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం వినియోగదారులకు ఆరు హక్కులు ప్రసాదించింది.

వినియోగదారుల రక్షణ చట్టం–2020

వినియోగదారుల రక్షణ చట్టాన్ని 1986లో భారత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా అది 1987 డిసెంబర్‌లో దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. చట్టం అమలులో ఉన్నప్పుడు మార్కెట్ పరిధి చాలా తక్కువ. ఆ సమయంలో సూపర్ మార్కెట్లు, ఈ కామర్స్ వంటివి లేవు. ఇప్పుడున్నట్లు ఇతర దేశాలతో వస్తువుల ఎగుమతి, దిగుమతులు ఉండేవి కావు. దీంతో పాత చట్టాల ప్రకారం ఫిర్యాదులు చేయడం సమస్యగా మారడంతో భారత ప్రభుత్వం 2020లో కొత్తచట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ చట్టంలో ప్రస్తుత మార్కెట్ విధానాలకు తగ్గట్లుగా పలు అంశాలు చేర్చారు. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. ఫిర్యాదులను 48గంటల్లో స్వీకరించి వాటిని నెల రోజుల్లో పరిష్కరించేలా సూచనలు చేశారు. వీలైతే ఫాస్ట్‌ట్రాక్ ప్రాతిపదికన ఫిర్యాదులు పరిష్కరించే కీలక సంస్కరణలు చేశారు. వస్తువులు ఉత్పత్తి చేసే కంపెనీలు వాటిపై జవాబుదారీతనం ఉండేలా చట్టంలో జోడించారు. వస్తువులు కొన్నచోటనే కాకుండా ఎక్కడైనా కేసు వేసే అవకాశం కల్పించారు. వినియోగదారులకు ఉండే హక్కులు వాటిని పరిష్కరించుకునే మార్గాలను స్పష్టంగా పేర్కొన్నారు. ఇందులో వినియోగదారులకు రక్షణహక్కు, సమాచార హక్కు, వస్తు సేవలందుకునే హక్కు, ప్రాతినిధ్యహక్కు, విజ్ఞాపన హక్కు, వినియోగదారుల విద్యా హక్కు ఉన్నాయి.

తక్కువ ఖర్చుతో సమస్యల పరిష్కార వేదికలు

వినియోగదారులకు తక్కువ ఖర్చుతో త్వరగా వివాదాలు పరిష్కరించడానికి ప్రభుత్వం వివిధ రకాల పరిష్కార వేదికలు ఏర్పాటు చేసింది. జాతీయ, రాష్ట్ర వినియోగదారుల పరిష్కార సంఘాలతో పాటు జిల్లాలో వినియోగదారుల పరిష్కార వేదిక జిల్లా కోర్టును డిస్ట్రిక్ట్ ఫోరంగా వ్యవహరిస్తారు. ఈ వేదికలు క్వాసీ జ్యుడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి.

- వినియోగదారుల రక్షణ హక్కు: మానవ ప్రాణాలు, ఆస్తికి ప్రమాదకర వస్తువుల వలన రక్షణ పొందే హక్కు.
- సమాచారం పొందే హక్కు: అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించడానికి, వస్తువుల నాణ్యత బరువు స్వచ్ఛత గురించి తెలిపే హక్కు.
- వస్తువులు, సేవల ఎంపిక హక్కు: వివిధ రకాల వస్తువుల కొనుగోలు, ఆ వస్తువుల సేవలు పొందడానికి వాటి రేటు నాణ్యత తెలుసుకోవడం, నాణ్యమైన సేవలు పొందడం.
- ప్రాతినిధ్యం వహించే హక్కు: వినియోగదారుల హక్కులు, ఆసక్తిని వారి అవసరాలను సరైన వేదికలో ఫోరంలో వినిపించడం, వినియోగదారుల సంక్షేమార్థం వివిధ వేదికలలో ప్రాతినిధ్యం వహించడం.
- వస్తు, సేవ లోపాల నుంచి పరిహారం పొందే హక్కు: వినియోగదారులు మోసాలకు గురైనప్పుడు ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా పరిహారం పొందడం.
- వినియోగదారుల విద్యాహక్కు: వినియోగదారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ తమ జ్ఞానం, నైపుణ్యాలను పెంచుకోవడం.
- స్వచ్ఛమైన పర్యావరణ హక్కు: పర్యావరణానికి ఎలాంటి కీడు చేయకుండా వస్తువులు, సేవలు పొందడం వినియోగదారుల హక్కు.

సింగరేణి బకాయిలను ప్రభుత్వం చెల్లించాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.25వేల కోట్లను వెంటనే చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆర్కే 5బీ గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బాకీ చెల్లించకపోవడంతో సంస్థకు నిధులు లేక బయటి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవాల్సివస్తోందని పేర్కొన్నారు. దీంతో సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లో పడనుందని తెలిపారు. గనుల్లో రక్షణపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఆచరణలో అధికారులు విఫలయ్యారని విమర్శించారు. ప్రమాదాలు జరుగుతున్నా సరైన రక్షణ చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. గనుల్లో వెంటిలేషన్ మెరుగుపర్చాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాగిడి శ్రీకాంత్, బొంపెల్లి రమేశ్, స్వామి, సంపత్, తిరుపతి, శివకుమార్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



ఒడ్డెటి తిరుపతి (ఫైల్)

సిర్పూర్(టి): పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. సిర్పూర్(టీ) ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని గోవింద్‌పూర్ కాలనీకి చెందిన ఒడ్డెటి తిరుపతి (34) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పనీ చేయకుండా ఖాళీగా తిరుగుతుండేవాడు. భార్య, కుటుంబ సభ్యులు మద్యం మానేయాలని ఇటీవల మందలించారు. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 8న గోవింద్‌పూర్ సమీపంలోని పొలంలో పురుగుల మందు తాగాడు. కాలనీకి వచ్చి వాంతులు చేసుకోగా కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మంచిర్యాల దవాఖానాకు తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తండ్రి నాగులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టీ స్టాల్‌లో సెల్‌ఫోన్ చోరీ

భీమారం: మండల కేంద్రంలోని ఆవిడం ఎక్స్ రోడ్డులోగల టీ స్టాల్ యజమాని కొమ్ము తరుణ్‌కు చెందిన సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం దొంగిలించారు. ఈ మేరకు ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నాలుగు రోజుల క్రితం కూడా తన మరో సెల్‌ఫోన్ చోరీకి గురైందని తెలిపాడు. టీ తాగేందుకు వచ్చినవారిపైనే అనుమానం వ్యక్తం చేశాడు.

'కార్మికులను వేధిస్తున్నారు'

శ్రీరాంపూర్: ఏరియా వర్క్‌షాప్‌లో అధికారులు కార్మికులను వేధిస్తున్నారని హెచ్‌ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆరోపించారు. మంగళవారం ఆయన ఏరియా వర్క్‌షాప్‌లో కార్మికులతో మాట్లాడారు. జనరల్ మజ్దూర్ కార్మికులపై పనిభారం మోపుతున్నారని పేర్కొన్నారు. మహిళా కార్మికులు ఉపయోగించే మరుగుదొడ్ల వద్ద అడ్డుగా గోడకట్టాలని పలుసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని తెలిపారు. విశ్రాంతి గది ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీ డ్రైవర్లకు ప్లేడేలు ఇవ్వకుండా ప్రైవేట్ వారితో పనిచేయిస్తున్నారని తెలిపారు. కొత్తగా 22 మంది ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లను తీసుకుంటున్నారని, టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నాయకులు ప్రైవేటీకరణను అడ్డుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా పలువురు హెచ్‌ఎమ్మెస్‌లో చేరారు. యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జీవన్‌జోయల్, కార్యదర్శి తిప్పారపు సారయ్య, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డి, నాయకులు కొమురయ్య, అశోక్, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, సాయి, శ్రీను, నారాయణ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



సరిత (ఫైల్)

మంచిర్యాలక్రైం: కుటుంబ కలహాల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. 14రోజుల చికిత్స తర్వాత తుది శ్వాస విడిచింది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక హమాలీవాడకు చెందిన శీలం శ్రీనివాస్‌కు కాగజ్‌నగర్ రాళ్లగూడేనికి చెందిన సరిత (32)తో 2017 నవంబర్ 24న వివాహమైంది. శ్రీనివాస్ జనరేటర్ల రిపేర్ చేస్తూ జీవనం సాగించేవాడు. వీరికి కూతురు కళ్యాణి (5) 14నెలల బాబు శశివర్ధన్ ఉన్నారు. రెండేళ్లు సజావుగా సాగిన వీరి కాపురంలో కలహాలు మొదలయ్యాయి. తరచూ ఇద్దరూ గొడవ పడుతుండేవారు. గత నెల 26న శ్రీనివాస్, సరిత వేములవాడకు దైవదర్శనానికి వెళ్లారు. 27న ఇంటికి చేరుకోగా, 28న వీరిద్దరి మధ్య వేములవాడలో కొనుగోలు చేసిన వస్తువుల విషయమై గొడవ జరిగింది. ఈ విషయంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులూ సరితతో గొడవపడ్డారు. దీంతో ఆమె క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే మంటలార్పి ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా వరంగల్ ఎంజీఎంకు తరలించగా 14రోజుల చికిత్స అనంతరం సోమవారం రాత్రి మృతిచెందింది. శ్రీనివాస్ కుటుంబీకుల వేధింపులతోనే సరిత ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

31లోపు దరఖాస్తు చేసుకోవాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): 10వ వేజ్‌బోర్డులో పని చేసి రిటైర్డయినవారు ఈనెల 31లోగా సీపీఎంఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్) కే బసవయ్య సూచించారు. మంగళవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్‌మెంట్ సంక్షేమాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ కార్డుల కోసం దరఖాస్తులు, కార్డుల వినియోగం, రెన్యూవల్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సందేహాలను నివృత్తి చేశారు. 10వ వేజ్‌బోర్డులో పని చేసి ఉద్యోగ విరమణ పొందినవారికి సంస్థ హెల్త్ కార్డుల కోసం మరో అవకాశం కల్పించిందని తెలిపారు. హెల్త్‌కార్డు కావాల్సినవారు రూ.40వేలు డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే కొంత రుసుం చెల్లించినవారు మిగతా మొత్తాన్ని ఈనెల 31లోపు చెల్లించి సంబంధిత గనులు, డిపార్ట్‌మెంట్లలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. పర్సనల్ మేనేజర్ లక్ష్మణ్‌రావు, డీవైపీఎం తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి కిరణ్‌కుమార్, సంక్షేమాధికారి ప్రకాంత్ పాల్గొన్నారు.